జస్టిస్ ఎన్వి.రమణకు ఘన స్వాగతం

గౌరవ వందనం స్వీకరిస్తున్న ఎన్వి.రమణ

కాకినాడ: సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వి.రమణకు కలెక్టర్ షాన్ మోహన్, ఎస్పి జి.బిందు మాధవ్, జిల్లా 4వ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి నిరుపమ, ఎఎస్పి మనీష్ పాటిల్ దేవరాజ్, ఆర్డిఒ ఎస్.మల్లిబాబు పుష్పగుచ్ఛాలు, పూల మొక్కలు అందించి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం పోలీసుల నుంచి గౌరవ వందనాన్ని స్వీకరించారు. మంగళవారం ఉదయం 9 గంటలకు అన్నవరం సత్యనారాయణ స్వామిని ఎన్వి.రమణ దర్శించుకోనున్నారు.

నాడు హామీలు... నేడు అరెస్టులా...

- పలుచోట్ల అంగన్‌వాడీల నిర్బంధం
- ప్రభుత్వ తీరుపై తీవ్ర ఆగ్రహం
- కాకినాడ కలెక్టరేట్ వద్ద ధర్నా

అంగన్‌వాడీలు చేపట్టిన చలో విజయవాడపై ప్రభుత్వం నిర్భందకాండకు దిగింది. ముందస్తుగా సంబంధిత అధికారులకు అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నేతలు ధర్నాకు విజయవాడ వెళ్తున్నట్లు వినతిపత్రాలు అందించారు. ప్రభుత్వ ఒత్తిడితో ఐసిడిఎస్ అధికారులు, సూపర్‌వైజర్లు సెక్టార్ మీటింగ్‌ల పేరుతో అంగన్‌వాడీలను చలో విజయవాడకు వెళ్లకుండా కుట్రలు సాగించారు. జిల్లాలో కొన్ని ప్రాంతాల్లో అంగన్‌వాడీలు వీరి కుట్రలను ఎదుర్కొని విజయవాడకు తరలివెళ్లారు. తుని, సామర్లకోట ప్రాంతాల్లో అంగన్‌వాడీలను పోలీసులు అరెస్టు చేశారు. మరికొన్ని ప్రాంతాల్లో అధికారుల ఒత్తిడితో సెక్టార్ మీటింగ్‌లకు హాజరైన అంగన్‌వాడీలు అక్కడే తమ నిరసనను వ్యక్తం చేశారు.

ప్రజాశక్తి - యంత్రాంగం

కాకినాడ కనీస వేతనాల కోసం అంగన్‌వాడీ కార్యకర్తలు చేపట్టిన 42 రోజుల సమ్మె సందర్భంగా తెలుగుదేశం నేతలు న్యాయమైన కోర్కెలను తీర్చుతామని నాడు హామీలిచ్చి అధికారంలోకి వచ్చాక ఆ హామీలను అమలు చేయాలని కోరిన అంగన్‌వాడీలను అరెస్టు చేయడం దారుణమని సిఐటియు, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు అన్నారు. అంగన్వాడీలకు కనీస వేతనాలు చెల్లించాలని విజయవాడలో జరిగే శాంతియుత ధర్నాకు బయలు దేరిన అంగన్‌వాడీలను తుని, సామర్లకోట ప్రాంతాల్లో పోలీసులు అడ్డుకోవడాన్ని నిరసిస్తూ సిఐటియు ఆధ్వర్యంలో కచేరిపేట సుందరయ్య భవన్ నుంచి ర్యాలీగా బయలుదేరి కలెక్టరేట్‌కి చేరుకుని ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు దువ్వా శేషబాబ్జి, శంఖవరం రాజేశ్వరి, పిఠాపురం గంగాభవాని మాట్లాడుతూ చారిత్రక 42 రోజుల అంగన్‌వాడీల సమ్మె సందర్భంగా శిబిరాల వద్దకు వచ్చి కూటమి ప్రభుత్వం రాగానే అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చి పది నెలలు గడుస్తున్నా జీతాలు పెంచకపోవడాన్ని వారు తప్పుపట్టారు. బతికుండగా వేతనాలు పెంచకుండా, చనిపోయాక మట్టి ఖర్చులు రూ.20 వేలు ఇస్తామని అంగీకరించి, రూ.15 వేలే చెల్లించేలా జీవో ఇచ్చినందుకు కూటమి నేతలు సిగ్గుపడాలన్నారు. సుప్రీంకోర్టు చెప్పినట్లు అంగన్‌వాడీలకు గ్రాడ్యుటీ చట్టాన్ని అమలు చేయకుండా, రిటైర్మెంట్ బెనిఫిట్ ప్రకటించి చేతులు దులుపుకుంటామంటే ఒప్పుకునేదిలేదన్నారు. సెంటర్ అద్దెలు, వంట ఖర్చులు నెలల తరబడి బకాయిలు పెడితే ఇచ్చే రూ.11వేల వేతనం వీటికే సరిపోతుండగా, కుటుంబాలను ఎలా పోషించుకోవాలని ప్రశ్నించారు. తక్షణమే అంగన్‌వాడీలకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని, మొబైల్ యాప్ పని భారాన్ని తగ్గించాలని, సుప్రీంకోర్టు చెప్పినట్లుగా గ్రాడ్యుటీ చట్టాన్ని అమలు చేయాలని, మినిట్స్‌లో అంగీకరించిన అంశాలన్నింటికీ జీవోలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి చెక్కల రాజ్‌కుమార్, కోశాధికారి మలకా రమణ, నగర కో కన్వీనర్ పలివెల వీరబాబు, వర్కింగ్ కమిటీ సభ్యులు మెడిశెట్టి వెంకటరమణ, అంగన్‌వాడీలు సత్యవతి, వీరవేణి, నారాయణమ్మ, వెంకటలక్ష్మి, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. **కాజులూరు** మండలంలోని కాజులూరు, గొల్లపాలెం సెక్టార్ల పరిధిలో అంగన్‌వాడీలను సూపర్‌వైజర్లు సెక్టార్ మీటింగ్ పేరుతో అడ్డుకున్నారు. చలో విజయవాడపై పోలీసులు నిర్బంధాన్ని ప్రయోగించడంతో కాకినాడ కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నాకు సైతం వెళ్లకుండా సూపర్‌వైజర్లు అంగన్‌వాడీలతో ధర్నాకు వెళ్లమని వారితో సంతకాలు పెట్టించుకుని అడ్డుకున్నారు. దీంతో అంగన్‌వాడీలు సెక్టార్ మీటింగ్ వద్దే ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా సెక్టర్ లీడర్ హనుమావతి మాట్లాడుతూ కాకినాడలో జరిగే ధర్నాకు సైతం వెళ్లకుండా అడ్డుకోవడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో గొల్లపాలెం కోలంక సెక్టర్ లీడర్లు వరలక్ష్మి, అన్నవరం అంగన్‌వాడీలు సలాది లక్ష్మి, నందికోళ్ల నాగమణి, మాత శేషారత్నం, మామిడి ప్రసన్న, కె.అరుణ పాల్గొన్నారు. **సామర్లకోట** స్థానిక రైల్వే స్టేషన్ వద్ద సామర్లకోట సిఐ కృష్ణ భగవాన్ సిబ్బందితో కలిసి అంగన్‌వాడీలను అడ్డుకున్నారు. చలో విజయవాడ వెళ్లకుండా వారిని అడ్డగించి వెనుకకు పంపివేశారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీలు మాట్లాడుతూ ఇచ్చిన హామీలను అమలు చేయకుండా అంగన్‌వాడీలను గృహనిర్బంధాలకు, అరెస్టులు చేయడం దారుణమన్నారు. తమ సమస్యలను పరిష్కరించకుంటే వైసిపికి పట్టిన గతే కూటమి పార్టీలకు పడుతుందని హెచ్చరించారు. **శంఖవరం** ఛలో విజయవాడ బయలు దేరిన అంగన్‌వాడీలను ఆదివారం రాత్రి అన్నవరం రైల్వే స్టేషన్‌లో పోలీసులు అడ్డుకున్నారు. తమ న్యాయం చేయాలని కోరుతున్న తమను అడ్డుకోవడం దారుణమని అంగన్‌వాడీ యూనియన్ నాయకురాలు బుల్లెమ్మ అన్నారు.

పెరవలి : చలో విజయవాడ నేపథ్యంలో మండలంలోని అంగన్‌వాడీలపై పోలీసులు నిర్బంధం విధించారు. పెరవలి ఐసిడిఎస్ పరిధిలోని నిడదవోలు, పెరవలి మండలాల నుండి సుమారు 150 మంది అంగన్‌వాడీలు రైళ్లు, బస్సులపై విజయవాడకు పయనమయ్యారు. తాడేపల్లిగూడెం రైల్వే స్టేషన్‌లో కొంత మందిని పోలీసులు నిర్బంధంలోకి తీసుకున్నారు జాతీయ రహదారిపై తనిఖీలు నిర్వహించి బస్సుల్లో వెళ్తున్న అంగన్‌వాడీలను కిందకు దింపేశారు. వారిని చేబ్రోలు పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

కాకినాడ కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న అంగన్‌వాడీలు

సామర్లకోటలో అంగన్‌వాడీలను అడ్డుకుంటున్న పోలీసులు

హోప్ ఐలాండ్‌లో పర్యటిస్తున్న కలెక్టర్ షాన్ మోహన్ సగిలి, ఎస్‌పి.బిందుమాధవ్

అభివృద్ధిపై ప్రణాళికను సిద్ధం చేయాలి

ప్రజాశక్తి - కాకినాడ

హోప్ ఐలాండ్ ఎకో టూరిజంని అభివృద్ధి చేసేందుకు అవసరమైన ప్రణాళికను సిద్ధం చేయాలని కలెక్టర్ షాన్‌మోహన్ సగిలి అధికారులను ఆదేశించారు. సోమవారం ఎస్‌పి జి.బిందు మాధవ్, జిల్లా అటవీ శాఖ అధికారి ఎ.రవీంద్రనాథ్‌రెడ్డి, పోర్టు అధికారి కెప్టెన్ ధర్మశాస్త్ర, అటవీ, పర్యాటక, మత్స్య, మెరైన్ పోలీస్ శాఖల అధికారులతో కలిసి హోప్ ఐలాండ్‌లో కలెక్టర్ పర్యటించారు. కాకినాడ సముద్ర తీరంలో ఉన్న రాష్ట్ర ప్రత్యేక రక్షణ దళం కార్యాలయం నుంచి హోప్ ఐలాండ్‌కు చేరుకుని అక్కడి ప్రదేశాలను పరిశీలించారు. ఎకో టూరిజం అభివృద్ధికి అనువుగా ఉన్న పరిస్థితులు, హోప్ ఐలాండ్ పరిధి, మడ అడవులు, వన్యప్రాణుల సంరక్షణ, సందర్శకులకు బోటింగ్ సౌకర్యం ఇతర అంశాలను ఆయా శాఖల అధికారులతో కలెక్టర్ చర్చించి, వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హోప్ ఐలాండ్ ప్రాంతాన్ని పర్యాటక రంగానికి కేంద్రంగా తీర్చిదిద్దేందుకు అవసరమైన ప్రణాళికను సిద్ధం చేయాలన్నారు. ఇందుకు వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆయన సూచించారు. ఈ పర్యటనలో జిల్లా మత్స్యశాఖ అధికారి కె. కరుణాకరబాబు, ఫారెస్ట్ రేంజ్ అధికారి ఎస్ఎస్ఆర్.వరప్రసాద్, సెక్షన్ అధికారి ఎం.నాగార్జున, అసిస్టెంట్ టూరిజం అధికారి వి.త్రిమూర్తులు, వాటర్ ఫ్లీట్ అసిస్టెంట్ మేనేజర్ గంగాబాబు, పోర్ట్ సిఐ పి.సునీల్‌కుమార్, మెరైన్ ఎస్ఐ పి.సురేష్, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆవిర్భావ సభ ఏర్పాట్లపై మంత్రి సమీక్ష

ప్రజాశక్తి - పిఠాపురం

మండలంలోని చిత్రాడ వేదికగా మార్చి 14వ తేదీన జరగనున్న జనసేన పార్టీ 14వ ఆవిర్భావ దినోత్సవ వేడుకల ఏర్పాట్లను జనసేన పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ ఛైర్మన్, మంత్రి నాదెండ్ల మనోహర్ సోమవారం పరిశీలించారు. భద్రత ఏర్పాట్లపై ఎస్‌పి బిందుమాధవ్, ఇతర ఉన్నతాధికారులతో సమీక్షించారు. సభకు తరలి వచ్చే లక్షలాది కార్యకర్తలు, అభిమానులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చూడాలని, ముఖ్యంగా ట్రాఫిక్ మళ్లింపులు, నిర్దేశిత పార్కింగ్ స్థలానికి వాహనాలు తేలికగా చేరుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పార్టీ చేస్తున్న ఏర్పాట్లను అధికారులకి తెలిపారు. అనంతరం ప్రధాన వేదిక, డి జోన్, మహిళల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన గ్యాలరీ, మీడియా గ్యాలరీ, విఐపి గ్యాలరీలను పరిశీలించారు. సభా ప్రాంగణంలోనూ, హైవే వెంబడి సిసి కెమెరాలు ఏర్పాటుపై చర్చించారు. ఈ కార్యక్రమంలో శాసనమండలి ప్రభుత్వ విప్ పిడుగు హరిప్రసాద్, ఎంపి తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్, ఎంఎల్‌ఎ పంతం నానాజీ, బొలిశెట్టి శ్రీనివాస్, పార్టీ కార్యక్రమాల నిర్వహణ కమిటీ ఛైర్మన్ కళ్యాణం శివ శ్రీనివాస్, ఎపి మెడికల్ సర్వీసెస్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ ఛైర్మన్ చిల్లపల్లి శ్రీనివాస్, రాష్ట్ర అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ ఛైర్మన్ చిలకలపూడి పాపారావు, ఎఎస్‌పి మనీష్ దేవరాజ్ పాటిల్, డిఎస్‌పి శ్రీహరిరాజు, తదితరులు పాల్గొన్నారు.

ఏర్పాట్లను సమీక్షిస్తున్న మంత్రి మనోహర్

అధిష్టానం నిర్ణయమే శిరోధార్యం: వర్మ

ప్రజాశక్తి - పిఠాపురం

టిడిపి అధిష్ఠానం నిర్ణయమే శిరోధార్యమని మాజీ ఎంఎల్‌ఎ ఎస్‌విఎస్‌ఎన్.వర్మ అన్నారు. సోమవారం స్థానిక టిడిపి కార్యాలయంలో కార్యకర్తలతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత 23 ఏళ్లుగా టిడిపి అధినేత చంద్రబాబుతోనే తన ప్రయాణం కొనసాగించానని, అధికారంలో ఉన్న లేకపోయినా నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం పని చేశానన్నారు. పార్టీకి, ప్రజలకు అండగా ముందుకు వెళుతున్ననన్నారు. తనకి ప్రజా సేవ చేయడానికి అవకాశం కల్పించడమే చంద్రబాబు తనికి ఇచ్చిన గొప్ప పదవన్నారు. పిఠాపురం టిడిపి శ్రేణులు మొత్తం చంద్రబాబు, భవిష్యత్ రథసారథి మంత్రి లోకేష్‌కి అండగా ఉండాలని, వారి ఆదేశాలను తూచా తప్పకుండా పాటిస్తానన్నారు. పార్టీ ఆదేశాలకు అనుగుణంగా పార్టీని బలపరుస్తూ పిఠాపురం టిడిపి నడుస్తుందని, పార్టీ కార్యకర్తలకు ఎల్లవేళలా అండగా ఉంటానన్నారు. పదవులు కేటాయించేటప్పుడు అధినేత ఎన్నో విపత్కర పరిస్థితులను ఎదుర్కోవలసి వస్తుందని నాయకులు, కార్యకర్తలు, అర్థం చేసుకోవాలన్నారు. అధిష్ఠానం నిర్ణయానికి కట్టుబడి గత ఎన్నికల్లో స్థానిక టిడిపి నాయకులు, కార్యకర్తలతో కలిసి కూటమి విజయానికి కృషి చేశామన్నారు.

మాట్లాడుతున్న మాజీ ఎంఎల్ఎ వర్మ

12న జరిగే ధర్నాను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి - పిఠాపురం

ఉపాధి హామీ, వ్యవసాయ కార్మికుల సమస్య పరిష్కరించాలని మార్చి 12న జరగబోయే మహా ధర్నాను జయప్రదం చేయాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కె.సింహాచలం పిలుపునిచ్చారు. సోమవారం మండలంలోని మంగితుర్తి, వెల్దుర్తి, విరవాడ, పి తిమ్మాపురం, రాయవరం, రాపర్తి గ్రామాల్లో కరపత్రాల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సింహాచలం మాట్లాడుతూ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసే కుట్రలో భాగంగా బడ్జెట్‌లో నిధుల కేటాయింపులు తగ్గించారని అన్నారు. వేసవి కాలంలో ఇస్తున్న సమ్మర్ అలవెన్స్‌ను రద్దు చేయడం, గడ్డపార, మంచినీటికి, గంపకిస్తున్న నిధులు ఇవ్వకుండా నిలిపివేశారని, పనుల దగ్గర ఎలాంటి సౌకర్యాలు కల్పించకపోవడం మూలంగా కూలీలు వడదెబ్బకు మత్యువాత పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధి కూలీలకు వారం రోజుల్లో వేతనాలు చెల్లించాలని చట్టంలో ఉన్న నెలల తరబడి చెల్లించకుండా కూలీల కడుపులు మాడుస్తున్నారన్నారు. సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 12న విజయవాడలో జరుగుతున్న మహాధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల నాయకులు ఉబా బుల్లబ్బాయి, కాల్దారి రాఘవ, డెక్కల లాజరు, దవ్వాల కృష్ణ, దవ్వాల సుబ్బు, లక్ష్మి, రత్నం, కుమారి పాల్గొన్నారు.

ప్రజలతో కలిసి కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న సింహాచలం

విద్యార్థులకు పరీక్షా సామగ్రి అందజేత

ప్రజాశక్తి - కరప

కరప హైస్కూల్లో చదువుతున్న 10వ తరగతి విద్యార్థులకు పరీక్ష సామగ్రిని అందించారు. మాజీ సర్పంచ్ పోలిశెట్టి తాతీలు విజ్ఞప్తి మేరకు శ్రీ చైతన్య, విజయగాయత్రి విద్యాసంస్థల యాజమాన్యం స్పందించి పరీక్ష సామగ్రికి సంబంధించిన అట్ట, పెన్, పెన్సిల్, షార్ప్నర్, స్కేల్, రబ్బర్ సమకూర్చారు. ఈ సామగ్రిని సోమవారం హైస్కూల్లో గ్రామ సర్పంచ్ ఆశాజ్యోతి చేతుల మీదుగా విద్యార్థులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం ఎన్.ప్రసాద్‌కుమార్, శ్రీ చైతన్య కాలేజీ ఎజిఎం ఎ.రాంబాబు, ప్రిన్సిపల్ ఎన్.సురేష్, స్థానికులు బి.రమేష్, బండారు మురళి, ముద్రగడ రమేష్, పాఠశాల ఉపాధ్యాయులు వి.రామమోహన్, టి.శ్రీనివాస్, పాల్గొన్నారు.

పరీక్షల సామగ్రిని పంపిణీ చేస్తున్న సర్పంచ్

సత్యప్రతాప్‌కు డాక్టరేట్

ప్రజాశక్తి - తాళ్లరేవు

కైట్ ఇంజినీరింగ్ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ గుడాల సత్యప్రతాప్‌కు మలేషియా విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ లభించింది. పునరుత్పాదక ఇంధనం, కృత్రిమ మేథస్సు రంగంలో సమర్పించిన పరిశోధనకు మలేషియాలోని లింకన్ విశ్వవిద్యాలయం నుంచి ఇంజనీరింగ్‌లో డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ యొక్క ప్రతిష్టాత్మక డిగ్రీని ప్రదానం చేశారు. సస్టైనబుల్ డెవలప్‌మెంట్ కోసం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, గ్రీన్ టెక్నాలజీస్‌తో రెన్యూవబుల్ ఎనర్జీ పవర్ సిస్టమ్స్ డిజైన్, అనాలిసిస్ పేరుతో ప్రతాప్ పరిశోధన చేశారు. మలేషియా లింకన్ యూనివర్సిటీ కాలేజ్ చాన్సలర్ నార్మల్ మార్ట్ సన్, వైస్ చాన్సలర్ అమియా భౌమిక్ ల ద్వారా ప్రతాప్ డాక్టరేట్ పట్టా అందుకున్నారు. ఈ సందర్భంగా సోమవారం ప్రతాప్‌ను పలువురు అభినందించారు.

సత్యప్రతాప్

ఓట్లు వేయలేదని రోడ్లు వేయట్లేదు

ప్రజాశక్తి - సామర్లకోట

గత ఎన్నికల్లో కూటమి ప్రభుత్వానికి ఓట్లు పడలేదని రోడ్లు నిర్మించడం లేదంటూ 13వ వార్డుకు చెందిన ప్రజలు మున్సిపల్ కమిషనర్ ఎ.శ్రీవిద్యకు ఫిర్యాదు చేశారు. సోమవారం వార్డుకు చెందిన వైసిపి కౌన్సిలర్ నేతల హరిబాబు ఆధ్వర్యంలో పలువురు ప్రజలు మున్సిపల్ కమిషనర్‌ను కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ తమ వార్డులో గత ఎన్నికల్లో కూటమి ప్రభుత్వానికి ఎక్కువ ఓట్లు పడలేదని తమ వార్డులో రహదారుల నిర్మాణాలు చేపట్టడం లేదంటూ విన్నవించారు. చివరకు రోడ్ల నిర్మాణానికి వేసిన మెటీరియల్ సైతం వెనక్కి తీసుకుని పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. తమ వార్డులో అవసరమైన చోట్ల రహదారులు నిర్మించాలని, ఇతర అభివృద్ధి పనులు చేపట్టాలని కోరారు.

కమిషనర్‌తో మాట్లాడుతున్న కౌన్సిలర్ హరిబాబు

సమస్యలపై నిలదీసిన కౌన్సిలర్లు

ప్రజాశక్తి - పెద్దాపురం

పట్టణ పరిధిలో పారిశుధ్య నిర్వహణ, గోదావరి మంచినీటి సరఫరా, కుక్కలు, పందుల బెడద నివారణలో అధికారుల నిర్లక్ష్యంపై పలువురు కౌన్సిలర్లు అధికారులను నిలదీశారు. సోమవారం మున్సిపల్ ఛైర్‌పర్సన్ బొడ్డు తులసి మంగతాయారు అధ్యక్షతన మున్సిపల్ కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కౌన్సిలర్ విజ్జపు రాజశేఖర్ మాట్లాడుతూ పట్టణ పరిధిలో పందులు, కుక్కలు విచ్చలవిడిగా సంచరిస్తున్నాయన్నారు. రహదారుల్లో నడవడానికి ప్రజలు భయపడుతున్నారన్నారు. పందులు బయట తిరగకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆంజనేయస్వామి గుడి సెంటర్లో గతంలో పడగొట్టిన మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ స్థలంలో నూతన కాంప్లెక్స్ వెంటనే నిర్మించాలన్నారు. కౌన్సిలర్ ఎర్రా శ్రీను మాట్లాడుతూ తన వార్డు పరిధిలో పారిశుధ్యం అధ్వానంగా ఉందన్నారు. కౌన్సిలర్ ముప్పన శ్యామలాంబ మాట్లాడుతూ బంగారమ్మ గుడి వీధి సెంటర్లోని అర్బన్ హెల్త్ సెంటర్ చుట్టూ ప్రహరీ గోడ నిర్మించాలన్నారు. కౌన్సిలర్ త్సలికి సత్యభాస్కరరావు మాట్లాడుతూ వేసవిలో మంచినీటి యద్దటి లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. మున్సిపల్ ఛైర్మన్ తులసి మంగతాయారు, వైస్ ఛైర్మన్ నెక్కంటి సాయిప్రసాద్ పారిశుద్ధ్య నిర్వహణ, గోదావరి మంచినీటి సరఫరాపై అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో కమిషనర్ కెవి.పద్మావతి, మేనేజర్ జ్యోతిరాణి, ఇతర అధజకారులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కౌన్సిలర్లు

13న ఉచిత నేత్ర వైద్య శిబిరం

ప్రజాశక్తి - సామర్లకోట

స్థానిక పాత మండల రెవెన్యూ కార్యాలయం వద్ద గల ఆంధ్ర జూబిలీ బాప్టిస్ట్ చర్చిలో ఈ నెల 13వ తేదీన ఉచిత నేత్ర శిబిరం నిర్భహిస్తున్నట్లు సంఘ అధ్యక్షులు బిఎస్.వందనం, రెవ డాక్టర్ బి.కిరణ్‌కుమార్, నాయకులు ఐఇ.జీవన్‌కుమార్ తెలిపారు. సోమవారం వారు మాట్లాడుతూ కాకినాడ కిరణ్ కంటి ఆసుపత్రి సౌజన్యంతో ఆంధ్ర జూబిలీ చర్చి ఆధ్వర్యంలో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఈ శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ శిబిరంలో వైద్య సేవలందించడంతోపాటు, శస్త్రచికిత్సలు అవసరమైన వారిని గుర్తించడం జరుగుతుందని, వారికి కాకినాడ కిరణ్ ఆసుపత్రిలో ఉచితంగా ఆపరేషన్‌లు చేస్తారని తెలిపారు. పట్టణ పరిసర ప్రాంతాలకు చెందిన ప్రజలు ఈ అవకాకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

'వైద్యుల నిర్లక్ష్యం వల్లే తమ్మయ్యబాబు ఆగ్రహం'

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

స్థానిక సిహెచ్‌సి వైద్యుల నిర్లక్ష్యం వల్లే జనసేన నాయకుడు తమ్మయ్యబాబు ఆగ్రహం వ్యక్తం చేశారని ఏలేశ్వరం మండలం లింగంపర్తి గ్రామానికి చెందిన చంద్రకళ అన్నారు. రోడ్డు ప్రమాదంలో గాయపడిన తన బిడ్డను తీసుకుని 108లో సిహెచ్‌సికి వెళ్లినట్లు తెలిపారు. మధ్యాహ్నం 2 గంటల సమయంలో వెళ్లామని వైద్యులు, సిబ్బంది పట్టించుకోకపోవడంతోనే తాను వరుపుల తమ్మయ్య బాబుకు సమాచారం ఇచ్చానని అన్నారు. వైద్యులు ఫోన్లో మాట్లాడేందుకు నిరాకరించడంతో ఆయనే స్వయంగా వచ్చి వైద్య సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారని అన్నారు. ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది వ్యవహరిస్తున్న తీరుపై జనసేన అధ్యక్షుడు పవన్ దృష్టి సారించాలని ఆమె కోరారు.

కార్టూ'నిజం'



ప్రయివేటుకు అప్పగిస్తే తిరుగుబాటు తప్పదు

ప్రజాశక్తి - తుని

ప్రజాధనంతో వైసిపి పాలనలో నిర్మించిన మెడికల్ కాలేజీలను ప్రయివేటుకు అప్పగిస్తే తిరుగుబాటు తప్పదని మాజీ మంత్రి, వైసిపి జిల్లా అధ్యక్షుడు దాడిశెట్టి రాజా హెచ్చరించారు. సోమవారం స్థానిక వైసిపి కార్యాలయంలో ఫీజు పోరు పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద విద్యార్థులను డాక్టర్లుగా చూడాలని ఉన్నతమైన ఆశయంతో 17 మెడికల్ కాలేజీలను నిర్మాణాలు చేపట్టడం జరిగిందని, వీటి కొరకు రూ.17 వేల కోట్ల ప్రజాధనాన్ని కేటాయించినట్లు తెలిపారు. వీటిని చంద్రబాబు అనుసరులకు అప్పగించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలం అయ్యిందని అన్నారు. విద్యార్థులకు ఫీజు రియంబర్స్‌మెంట్, నిరుద్యోగ భృతి, ఎందుకు చెల్లించలేదని ప్రశ్నించారు. ఈ నెల 12వ తేదీన కాకినాడలో చేపడుతున్న ఫీజు పోరు పోరాటానికి విద్యార్థులు, మేధావులు, విద్యార్థులు తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాల నాయకులు తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యనమల కృష్ణుడు, లంక కృపానందం, లగుడు శ్రీనివాస్, చింతకాయల చినబాబు, సోడిశెట్టి సత్యనారాయణ, జగటాల వీరబాబు, పోతల లక్ష్మణ్, గంగ బాబు, తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ మంత్రి దాడిశెట్టి రాజా, ఇతరులు

కార్యకర్తలతో మాట్లాడుతున్న ముద్రగడ పద్మనాభం

12న ఫీజు పోరు యాత్ర

ప్రజాశక్తి - కిర్లంపూడి

ఈనెల 12న జరిగే ఫీజు పోరు యాత్రను విజయవంతం చేయాలని నియోజకవర్గ వైసిపి కోఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు పిలుపునిచ్చారు. సోమవారం శంఖవరం మండలం కత్తిపూడి గ్రామానికి చెందిన వైసిపి నాయకులు ముద్రగడ పద్మానాభంను కలిశారు. ఈ సందర్భంగా 12వ తేదీన జరిగే ఫీజు పోరు యాత్ర పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 10 నెలలు కావస్తున్నా విద్యార్థులకు చెల్లించాల్సిన ఫీజులను చెల్లించలేదన్నారు. విద్యార్థులకు బకాయిలు ఉన్న ఫీజులను తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్లు శిడగం వెంకటేశ్వరరావు, బదిరెడ్డి గోవింద్, నరాల శ్రీను, జిల్లా సమాచార అధ్యక్షులు గౌతు స్వామి, నాయకులు రామిశెట్టి నాని, గొల్లపల్లి సురేష్, చింతకాయల సత్యనారాయణ పాల్గొన్నారు.

మూల్యాంకనం విధులపై అవగాహన

ప్రజాశక్తి - కాకినాడ

పదో తరగతి పరీక్షా పత్రాల మూల్యాంకన, విధులు తదితర అంశాలపై రాష్ట్ర పరిశీలకుల సమావేశం జరిగింది. సోమవారం స్థానిక రామకృష్ణ ఆడిటోరియం హాల్లో జరిగిన ఈ సమావేశంలో జోన్-II రీజినల్ జెడి జి.నాగమణి పాల్గొని మాట్లాడారు. పదో తరగతి పరీక్షా ముల్యాకనం విధులు, ప్రాముఖ్యత తదితర అంశలపై సూచనలు చేశారు. అనంతరం డిఇఒ రమేష్, పశ్చిమ గోదావరి డిఇఒ నారాయణ సిసిఒ, ఎసిఒలకు అవగాహన కల్పించారు.

సమావేశంలో మాట్లాడుతున్న జెడి నాగమణి

నేరాలు ఘోరాలు

చోరీ కేసుల్లో ఇద్దరి అరెస్టు

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

మూడు పోలీస్ స్టేషన్ల పరిధిలో జరిగిన వివిధ చోరీలపై నమోదు అయిన కేసుల్లో ఇద్దరు వ్యక్తులను పోలీసులు అరెస్టు చేశారు. సోమవారం స్థానిక ఇంద్రపాలెం పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో డిఎస్‌పి మనీష్‌దేవరాజ్ పాటిల్ ఈ కేసులకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. ఇంద్రపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో రెండు చోరీ కేసులు, కరప, కాకినాడ ఒకటవ పట్టణ పోలీస్ స్టేషన్లో పరిధిలో జరిగిన చోరీ కేసులు జరిగాయన్నారు. ఈ కేసుల్లో ముద్దాయిలైన రూరల్ మండలం తూరంగి సత్యదేవనగర్ ప్రాంతానికి చెందిన గంపల సతీష్, కిర్లంపూడి మండలం బూరుగుపూడి గ్రామానికి చెందిన పట్టిం వరప్రసాద్‌లను అదుపులోకి తీసుకుని విచారించగా ఆయా చోరీలను ఉమ్మడిగా చేసినట్లు అంగీకరించారని తెలిపారు. వీరి నుంచి 78 గ్రాముల బంగారు ఆభరణాలు, ఒక హీరో సిడి డీలక్స్ వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో సిఐ డిఎస్.చైతన్యకృష్ణ, క్రైం సిఐ వి.కృష్ణ, ఇంద్రపాలెం ఎస్ఐ ఎం.వీరబాబు, ఎఎస్ఐలు గోవిందు, పుల్లయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుని మృతి

ప్రజాశక్తి - కిర్లంపూడి

మండలంలోని రాజుపాలెం ప్రధాన రహదారిపై ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. మండలంలోని చిల్లంగి గ్రామానికి చెందిన కొప్పన అప్పారావు (29) ఆదివారం రాత్రి అత్తంటికి వీరవరం వెళ్తుండగా రాజుపాలెం సమీపంలో లారీ ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో తలకు బలమైన గాయం కావడంతో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. అప్పారావుకు భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. విషయం తెలుసుకున్న బంధువులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహంతో రహదారిపై టెంట్ వేసి, రోడ్డుపై బైఠాయించి ఆందోళన నిర్వహించారు. దీంతో జగ్గంపేట సిఐ వైఆర్‌కె.శ్రీనివాస్, జగ్గంపేట ఎస్ఐ టి.రఘునాథరావు సంఘటనా స్థలానికి చేరుకుని ఆందోళనకారులతో చర్చలు నిర్వహించారు. ఫలితం లేకపోవడంతో డిఎస్‌పి శ్రీహరిరాజు సోమవారం ఉదయం సంఘటనా స్థలానికి చేరుకుని ఆందోళన ఆందోళనకారులతో చర్చలు నిర్వహించారు. ఎట్టకేలకు ఆందోళన విరమించారు. దీంతో మృతదేహాన్ని శవ పంచనా నిమిత్తం ప్రత్తిపాడు సిహెచ్‌సి తరలించి పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని బంధువులకు అప్పగించామని పోలీసులు తెలిపారు. మతిడి బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎఎస్ఐ బిఎన్.కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పేకాడుతున్న 10 మంది అరెస్టు

ప్రజాశక్తి - కోరుకొండ

మండలంలోని గాదరాడ శివారులో పేకాట శిబిరంపై పోలీసులు దాడి చేసి 10 మందిని అరెస్ట్ చేశారని కోరుకొండ సిఐ వై.సత్యకిషోర్ తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు స్పెషల్ పార్టీతో కలిసి దాడి చేయగా పేకాడుతున్న వారిని అదుపులోకి తీసుకున్నామన్నారు. వారి నుంచి రూ.84,760 నగదు, 13 సెల్ పోన్లు, ఐదు బైకులను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. పేకాట శిబిరానికి చెందిన ముగ్గురు ఆర్గనైజర్లు పరారీలో ఉన్నారన్నారు. ఈ దాడుల్లో కోరుకొండ ఎస్ఐ టి.శ్యామ్ సుందర్ తదితరులు పాల్గొన్నారు.

లారీ ఢీకొని మహిళ మృతి

ప్రజాశక్తి-రావులపాలెం

ఊబలంక శెట్టిబలిజనగర్ రహదారి వద్ద లారీ ఢీకొని ఒక మహిళ అక్కడికక్కడే మృతి చెందగా మరొక వ్యక్తికి గాయాలైనట్టు ఎస్ఐ ఎస్.రాము తెలిపారు. పోలీసులు తెలిపన వివరాల ప్రకారం సోమవారం ఆత్రేయపురం మండలం కట్టుంగకు చెందిన వందే విజయకుమారి తన భర్త రమేష్‌బాబుతో కలిసి బైక్‌పై కట్టుంగ వెళుతుంగా వెనుకనుంచి లారీ వెనుక వైపు నుండి ఢీకొనడంతో విజయకుమారి(40) మృతి చెందగా ఆమె భర్తకు గాయాలయ్యాయి. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కొత్తపేట ఏరియా ఆసుపత్రికి తరలించామని ఎస్ఐ తెలిపారు.

గాయపడిన వ్యక్తి మృతి

గొల్లప్రోలు : గొల్లప్రోలులో ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో సోమవారం మృతి చెందాడు. తొండంగి మండలం శృంగవృక్షం గ్రామానికి చెందిన ఎ.చంద్రరావు గత నెల 26న శివరాత్రి సందర్భంగా పిఠాపురం ఆటోలో బయలు దేరాడు. గొల్లప్రోలు బైపాస్ శ్రీరామ్ స్కూల్ దగ్గరలో ఆగి ఉన్న వ్యాన్‌ను చంద్రరావు ప్రయాణిస్తున్న ఆటో ఢీకొంది. ఈ ప్రమాదంలో చంద్ర రావు తీవ్రంగా గాయపడ్డారు. అప్పటి నుంచి కాకినాడ లోని ప్రయివేటు ఆసుపత్రిలో చికిత్స పొందు తున్నాడు. పరిస్థితి విషమించడంతో మరణించాడు. కేసును దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ రామకృష్ణ తెలిపారు

విద్యుదాఘాతానికి గురైౖ రైతు మృతి

పిఠాపురం : పట్టణ శివారు మాదావపురంలో విద్యుదాఘాతానికి గురైౖ రైతు మృతి చెందిన ఘటన సోమవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే... పట్టణ పరిధిలోని ఐదో వార్డుకు చెందిన సిహెచ్ సత్యనారాయణ (65) అనే రైతు పశువులకు మేత కోసం పొలానికి వెళ్లి గడ్డి కోసుకుని తిరిగి వస్తుండగా ఆ ప్రాంతంలోని పొలాల పై క్రిందికి వేలాడుతున్న హై టెన్షన్ వైర్ తగిలి విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. ఎంతకి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు అక్కడికి వెళ్లి చూసేసరికి, అప్పటికే సత్యనారాయణ మృతి చెంది ఉన్నాడు. విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యం వల్లే ఈ సంఘటన చోటు చేసుకుందని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. మతిపై పట్టణ పోలీసులకు కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థి మృతి

సామర్లకోట : మండలంలోని గొంచాల గ్రామంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో చంద్రపాలెం గ్రామానికి చెందిన ఇంటర్ రెండవ సంవత్సరం విద్యార్థి ప్రగాఢ వంశీ(18) దుర్మరణం చెందాడు. స్థానిక పోలీసుల కథనం ప్రకారం...సోమవారం ఉదయం చంద్రపాలెం గ్రామం నుంచి ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్ష రాసేందుకు కాకినాడకు మోటార్ సైకిల్ పై వెళుతుండగా గొంచాల గ్రామంలో రోడ్డు పక్కన ఉన్న ఇసక గుట్టపైకి మోటార్ సైకిల్ ఎక్కి జారి పడటంతో అదే సమయంలో వస్తున్న ట్రాక్టర్ వెనుక చక్రాలు విద్యార్థి వంశీ పైనుంచి వెళ్లిపోవడంతో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు ప్రమాద స్థలాన్ని పరిశీలించారు. కేసు దర్యాప్తు ఎస్ఐ రమేష్ తెలిపారు

తుని మున్సిపాలిటీపై టిడిపి జెండా

ప్రజాశక్తి - తుని

తుని పట్టణ మున్సిపాలిటీని టిడిపి కైవసం చేసుకుంది. సోమవారం మున్సిపల్ కమిషనర్ ఎ.వెంకట రావు అధ్యక్షతన సాధారణ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఇటీవల టిడిపిలో చేరిన 16 మంది కౌన్సిలర్లు, కో ఆప్షనల్ సభ్యురాలు హాజరయ్యారు. వైసిపికి చెందిన కౌన్సిలర్లు ఎవరు సమావేశానికి హాజరు కాలేదు. మున్సిపల్ ఛైర్మన్ ఏలూరు సుధారాణి చేసిన రాజీనామాను కౌన్సిలర్లు ఆమోదించారు. వైస్ ఛైర్మన్‌గా ఉన్న కుచ్చలపాటి రూపాదేవిని ఇన్‌ఛార్జ్ ఛైర్మన్‌గా కౌన్సిల్ ఆమోదం తెలిపింది. సమావేశం అనంతరం ఇన్‌ఛార్జ్ ఛైర్మన్ రూపాదేవి మీడియాతో మాట్లాడారు. మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు, ఎంఎల్ఎ యనమల దివ్య సహకారంతో తుని మున్సిపాలిటీ అన్ని రంగాల్లోనూ అభివృద్ధి పరుస్తామని అన్నారు. ఈ సందర్భంగా ఆమెను కూటమి నాయకులు యనమల రాజేష్, మున్సిపల మాజీ ఛైర్మన్ ఇనుగంటి సత్యనారాయణ, నార్ల రత్నాజీ, మోతుకూరు వెంకటేష్,ఎస్. లోవరాజు, తదితరులు అభినందనలు తెలిపారు.

ఇన్‌ఛార్జ్ ఛైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన రూపాదేవి

వినతులకు శాశ్వత పరిష్కారం చూపాలి: జెసి

ప్రజాశక్తి - కాకినాడ

పిజిఆర్ఎస్ కార్యక్రమంలో వచ్చిన వినతులకు శాశ్వత పరిష్కారం చూపాలని జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ వివేకానంద హాలులో పిజిఆర్ఎస్ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో డిఆర్ఒ జె.వెంకటరావు, హౌసింగ్ పీడీ ఎన్‌వివి. సత్యనారాయణ, కెఎస్ఇజెడ్ ఎస్‌డిసి కెవి.రామలక్ష్మి, సిపిఒ పి.త్రినాథ్ ఇతర అధికారులతో కలిసి జెసి వినతులను స్వీకరించారు. ఈ అర్జీలను ఆయా శాఖల అధికారులకు సూచిస్తూ వాటిపై సత్వరం సమగ్రమైన, సంతృప్తికరమైన పరిష్కారాలు అందించాలని అధికారులను ఆదేశించారు. వివిధ శాఖల్లో నమోదైన అర్జీలపై సంబంధిత అధికారులు వెంటనే స్పందించి అర్జీదారుని సమస్యకు తగిన పరిష్కారం చూపాలని స్పష్టం చేశారు. అర్జీల వివరాలు ఎప్పటికప్పుడు ఆన్‌లైన్లో నమోదు చేయాలన్నారు. పలు సమస్యలకు సంబంధించి 594 అర్జీలు అందాయి. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు, కలెక్టరేట్ విభాగాల అధిపతులు పాల్గొన్నారు.

వినతులు స్వీకరిస్తున్న జెసి రాహుల్‌మీనా

యానాం వార్తలు

బడ్జెట్ సమావేశాలను ప్రారంభిస్తున్న గవర్నర్ కైలాస్ నాథన్

పుదుచ్చేరి బడ్జెట్ సమావేశాలు ప్రారంభం

ప్రజాశక్తి - యానాం

పుదుచ్చేరి శాసనసభ బడ్జెట్ సమావేశాలు సోమవారం ప్రారంభం అయ్యాయి. తొలిరోజు సమావేశం లెఫ్టినెంట్ గవర్నర్ కైలాస్ నాథన్ ప్రసంగంతో ముగిసింది. అనంతరం స్పీకర్ సెల్వం సభను మంగళవారానికి వాయిదా వేశారు. పుదుచ్చేరిని వ్యాపార, విద్య, ఆధ్యాత్మిక అలాగే మరింత ప్రముఖ పర్యాటక కేంద్రంగా మార్చడం, సామాజిక, ఆర్థిక అభివృద్ధిని వేగవంతం చేయడానికి ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను వివరించారు. అలాగే పుదుచ్చేరి స్థూల రాష్ట్ర దేశియోత్పత్తి గత ఐదేళ్లలో 44.06 శాతం వృద్ధిని సాధించిందని, వార్షిక సగటు వద్ధి రేటు 9.56 శాతంగా ఉందని వివరించారు. మంగళవారం గవర్నర్ ప్రసంగంపై చర్చ సాగనుంది. 12న పుదుచ్చేరి 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి పుదుచ్చేరి ముఖ్యమంత్రి ఎన్.రంగస్వామి ఆర్థికమంత్రి హోదాలో పుదుచ్చేరి వార్షిక బడ్జెట్‌ను సభలో ప్రవేశపెట్టనున్నారు. ఈనెల 27 వరకూ బడ్జెట్ సమావేశాలు జరగనున్నాయి.

ఇఫ్తార్ విందులో మాట్లాడుతున్న ఎంఎల్ఎ శ్రీనివాస్ అశోక్

ముస్లిములకు ఎంఎల్ఎ ఇఫ్తార్ విందు

ప్రజాశక్తి - యానాం

యానాంలో ముస్లిములకు ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. సోమవారం స్థానిక జామియా మసీదు, మసీదా కూబాల్లో జరిగిన ఇఫ్తార్ విందులో ఆయన మాట్లాడారు. ముస్లింలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోనున్నట్టు తెలిపారు. జామియా మసీదు ఎదురుగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ తొలగించడానికి, ముస్లిం బరేల్ గ్రౌండ్ అభివృద్ధికి రూ.16 లక్షలు మంజూరు చేయడం జరిగిందన్నారు. కొత్తగా ఘసూలాఖానాకు అదనంగా మరో రూ.16 లక్షలు అందించనున్నట్టు ప్రకటించారు. ముస్లిం షాదీఖానాకు రూ.40 లక్షలు త్వరలోనే మంజూరు చేయించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇమామ్‌లు మహమ్మద్ రఫీ, మహ్మద్ ఎజ్దానీ, మసీదుల అధ్యక్షులు ఎస్‌కెమ్.జిలానీ, కాలేషా, ముస్లిం పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న పాపారావు

జనసేన ఆవిర్భావ సభ జయప్రదానికి పిలుపు

ప్రజాశక్తి - తాళ్లరేవు

ఈనెల 14న పిఠాపురం నియోజకవర్గం చిత్రాడలో జరిగే జనసేన ఆవిర్భావ దినోత్సవ సభను విజయవంతం చేయాలని ఎపి అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ ఛైర్మన్ చిలకలపూడి పాపారావు పిలుపు నిచ్చారు. సోమవారం పత్తిగొందిలో జనసేన ఆవిర్భావ దినోత్సవ సన్నాహక సమావేశం జనసేన సీనియర్ నాయకులు గుద్దటి జమ్మి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరి ఆశలు, ఆశయాలకు అనుగుణంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని అన్నారు. ఎక్కడ సమస్య ఉన్న అక్కడ జననేత పవన్ కళ్యాణ్ ఉంటారని అన్నారు. అగ్నికుల క్షత్రియులంతా ఈ సభకు వేలాదిగా తరలి రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి మాజీ ఛైర్మన్ కుడుపూడి శివన్నారాయణ, మండల పార్టీ అధ్యక్షులు అత్తిలి బాబురావు, సర్పంచ్ పుణ్యమంతుల సూరిబాబు, నాయకులు తోటరాజు, దుళ్ల స్వామి, పుండరీష్, రంబాల రమేష్, కాలా సూరిబాబు పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న నిర్వాహకులు

ఆధునిక సర్వేయింగ్‌పై అవగాహన

ప్రజాశక్తి - గండేపల్లి

సూరంపాలెంలోని ఆదిత్య అగ్రికల్చరల్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో 'ఆధునిక సర్వేయింగ్'అనే అంశంపై 2 రోజుల వర్క్ షాప్ సోమవారం ప్రారంభం అయింది. అగ్రికల్చర్ ఇంజనీరింగ్ విభాగం డిప్యూటి విభాగాధిపతి డాక్టర్ వి.సాయికృష్ణ మాట్లాడుతూ అగ్రికల్చరల్ ఇంజనీరింగ్ విద్యార్థులకు సర్వేయింగ్‌లో ఆధునిక సాంకేతికత ఎంతో అవసరమన్నారు. ఆధునిక సర్వేయింగ్ పద్ధతులు జిపిఎస్, టోటల్ స్టేషన్ వంటి ప్రాక్టికల్ ప్రదర్శన ద్వారా అవగాహన పొందుతారని వివరించారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎన్.భాస్కర్‌రావు రిసోర్స్‌పర్సన్‌గా వ్యవహరించారు.

మరిడమ్మ ఆలయ ఛైర్మన్ గుండెపోటుతో మృతి

ప్రజాశక్తి - పెద్దాపురం

మరిడమ్మ ఆలయ అనువంశిక ధర్మకర్త, ఛైర్మన్ డాక్టర్ చింతపల్లి బ్రహ్మాజీ (78) సోమవారం ఉదయం గుండెపోటుతో మరణించారు. ఆయనకు భార్య, ముగ్గురు కుమారులు ఉన్నారు. ఆయన గత 30 సంవత్సరాలుగా ఆలయ ఛైర్మన్‌గా సేవలందిస్తున్నారు. ఆయన మృతి వార్త తెలిసిన వెంటనే ఆలయ అసిస్టెంట్ కమిషనర్ కె.విజయలక్ష్మి ఆధ్వర్యంలో ఆలయ సిబ్బంది ఎస్.రమణ, ఎన్‌వి.అవధాని, ఐవి.ప్రసాద్‌శర్మ, శంకర్, రాయి నాని, రామచంద్రప్రసాద్, వరహాలరావు, శివ తదితరులు రాజమహేంద్రవరంలోని ఆయన స్వగృహంలో భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

గోటిపై సూక్ష్మ కళాఖండం

ఛాంపియన్స్ ట్రోఫీ సూక్ష్మ కళాఖండం

ప్రజాశక్తి - పెద్దాపురం

పట్టణానికి చెందిన మాజీ కౌన్సిలర్, సూక్ష్మ కళాఖండాల శిల్పి, గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ గ్రహీత తాళాబత్తుల సాయి చేతిలో మరో సూక్ష్మ కళాఖండం ఐసిసి ఛాంపియన్స్ ట్రోఫీ కప్ రూపుదిద్దుకుంది. ఐసిసి ఛాంపియన్స్ ట్రోఫీలో భారత దేశం జట్టు 3వ సారి విజేతగా నిలిచిన సందర్భంగా మన జట్టుకు అభినందనలు తెలియజేస్తూ ఈ సూక్ష్మ కళాఖండాన్ని రూపొందిం చినట్లు సోమవారం ఆయన మీడియాకు వివరిం చారు. 0.100 మిల్లీగ్రాముల బంగారంతో 10 మిల్లీ మీటర్ల ఎత్తులో ఈ కప్పును తయారు చేసినట్లు చెప్పారు.

ఘనంగా ఆలయ 12వ వార్షికోత్సవం

ప్రజాశక్తి - కిర్లంపూడి

కిర్లంపూడి గ్రామంలోని వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయం 12వ వార్షికోత్సవ వేడుకను ఘనంగా జరిగాయి. ఈ వార్షికోత్సవ వేడుకలను ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు గత కొన్ని రోజులుగా ఆలయ అభివృద్ధి కమిటీ ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు మురళీ శర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి వివిధ పుష్పాలతో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్న సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు.

నందనవనంలో అన్నదానం

ప్రజాశక్తి - రౌతులపూడి

మండలంలోని మెరక చామవరం గ్రామంలో నందనవనంలో సోమవారం యాత్రికులకు ఆలయ కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు.

విజేత రాజేష్‌ను అభినందిస్తున్న కరస్పాండెంట్

కరాటే పోటీల్లో రాజేష్‌కు బంగారు పతకం

ప్రజాశక్తి - కాజులూరు

అంతర్జాతీయ కరాటే పోటీల్లో తమ పాఠశాల విద్యార్థి రాజేష్ బంగారు పతకం సాధించారని కాజులూరు వినాయక పాఠశాల కరస్పాండెంట్ టి.కిషోర్ తెలిపారు. ఈనెల 1, 2 తేదీల్లో విశాఖపట్నంలో జరిగిన అంతర్జాతీయ కరాటే సబ్ జూనియర్స్ పోటీల్లో వనుం చైతన్య రాజేష్ కుమిటి విభాగంలో బంగారు పతకం, కటాస్ విభగంలో కాంస్య పతకం సాధించాడని తెలిపారు. ఈ సందర్భంగా రాజేష్‌కు శిక్షణ ఇచ్చిన కరాటే శిక్షకులు శేఖర్‌ను ఎంఇఒలు డేవిడ్, జాన్, ఎంపిడిఒ రాంబాబు, కరస్పాండెంట్ కిషోర్, తదితరులు అభినందించారు.

NAME CHANGE

I, VADLAPATI NARESH (Old Name), S/o POORNACHANDHRARAO, D.No.4-227, Rayabhupalapatnam Village, Peddapuram Mandalam, Kakinada District, Andhra Pradesh -533 437. I have changing my name from **VADLAPATI NARESH** (Old Name), to **VADLAPATI NANI** (New Name).Hence forth I am being called as **VADLAPATI NANI** For all purpose.

దస్తావేజులు పోయినవి

కాకినాడ జిల్లా తాళ్ళరేవు మండలం పోలేకుర్రు గ్రామపంచాయితీ జై భీమ్ పేటకు చెందిన దున్నానీలాద్రి S/o రామస్వామి, సర్వే **నెం.182/1ఎ/2లో** గల 2.30 సెంట్లు సంబందించిన తన బార్య దున్నా పాపయమ్మకి వ్రాసిఇచ్చిన డాక్యుమెంట్ **నెం. 343/2023** గల డాక్యుమెంట్ పోలేకుర్రు గ్రామం నుంచి తాళ్ళరేవు వచ్చు మార్గంలో పోయినవి. కావున ఎవరికైనా దొరికిన యెడల ఈక్రింది అడ్రస్‌కు తెలియపరచవలెను.

అడ్రస్
దున్నా నీలాద్రి S/o రామస్వామి
డోర్ నెం. 1-7 పోలేకుర్రు, తాళ్ళరేవు మండలం
కాకినాడజిల్లా

ప్రకటన

కీ॥శే॥ రేవు సుందరమ్మ గారు

డా॥ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా, ఐ.పోలవరం మండలం, ఎదుర్లంక గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న రామాలయం పేట గ్రామ కాపురస్తురాలు రేవు సుందరమ్మ, W/o. రేవు సుబ్రమణ్యం (లేటు) గారి కుమారుడు రేవు సుధాకర్ వ్రాయించి ఇచ్చిన ప్రకటన.

నా తల్లి **రేవు సుందరమ్మ** గారు రామాలయం పేట గ్రామంలో మా ఇంటి వద్ద 03-03-2012 సంవత్సరంలో మరణించారు. వీరి మరణం ఎదుర్లంక గ్రామ పంచాయతీలోను మరియు ఏ ఇతర గ్రామపంచాయతీలోను నమోదు కాలేదు. ఏమైన అభ్యంతరాలు ఉన్న ఎడల పది రోజులలో తెలియజేయగలరు.

ఇట్లు: **రేవు సుధాకర్**
సుబ్రమణ్యం, డోర్ నెం. 1-28, రామాలయం పేట,
ఎదుర్లంక (పోస్టు), ఐ.పోలవరం మండలం
డా॥ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా, పిన్‌కోడ్: 533464

మూడో నేత్రంతో నేరాలు అదుపు

ప్రజాశక్తి - కాకినాడ

ప్రస్తుత సమాజంలో పెరిగిపోతున్న నేరాల వ్యవస్థను అదుపు చేసే దిశగా అడుగులు వేస్తున్నట్లు కలెక్టర్ షాన్‌మోహన్ సగిలి, ఎస్‌పి జి.బిందుమాధవ్ అన్నారు. సోమవారం డ్రోన్లులో శిక్షణ పొందిన పోలీసులతో 13 డ్రోన్లను ప్రయోగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మారుతున్న కాలంతో పాటు నేరాలను అదుపు చేసేందుకు సాంకేతికతను ఉపయోగించుకుని నేరస్తుల గుండెల్లో రైళ్లు పరిగెత్తిచ్చే విధంగా ఈ డ్రోన్లు ఉపయోగపడతాయని అన్నారు. మొదటి విడతలో 13 డ్రోన్లను అన్ని స్టేషన్లకు ఇచ్చామని, రానున్న కాలంలో మరిన్ని డ్రోన్లు కొనుగోలు చేసి నేరాలను అదుపు చేసేందుకు ఉపయోగిస్తామన్నారు. అలాగే బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించిన, కాలేజీలు వద్ద రేష్ డ్రైవింగ్ చేసిన ఈ డ్రోన్లతో కనిపెట్టి వారిపై కేసులు పెడతామని హెచ్చరించారు. అనంతరం సిఐలకు డ్రోన్లను అందజేశారు.



ఆకాశంలో ఎగురుతున్న డ్రోన్లు (వృత్తాల్లో)

మామిడి, జీడి మామిడి తోటల పరిశీలన

ప్రజాశక్తి - పెద్దాపురం

మండల పరిధిలోని పెద్దాపురం, జె.తిమ్మాపురం, కట్టమూరు గ్రామాల్లో ఉన్న మామిడి, జీడిమామిడి తోటలను దుంప పరిశోధన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ సునీత, ఉద్యాన శాఖ మండల అధికారి ఎన్.సుజాత పరిశీలించారు. ఈ సందర్భంగా వారు రైతులతో మాట్లాడుతూ పగటి ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉండటం వల్ల తామర పురుగు మామిడి తోటలను ఎక్కువగా ఆశించినట్టు గుర్తించామన్నారు. వర్షాధార తోటలలో పిందె రాలడం ఎక్కువగా ఉందన్నారు. నీటి సదుపాయం ఉన్నవారు 15 నుంచి 20 రోజుల వ్యవధిలో తేలిక పాటి నీటి తడులు పెట్టాలన్నారు. జీడి మామిడి తోటలలో పురుగు మందులతో పాటు సాప్ కిలో లేదా ఎ నత్ర కాల్ 2 గ్రాములు లీటర్ నీటికి కలిపి పిచికారి చేయాలన్నారు.

రైతులకు సూచనలు చేస్తున్న శాస్త్రవేత్త డాక్టర్ సునీత

సావిత్రిబాయి పూలేకి ఘన నివాళి

ప్రజాశక్తి - కాకినాడ రూరల్, గండేపల్లి

స్థానిక సన్ రైజ్ ఆసుపత్రిలో కాకినాడ ఐడిఎ సభ్యుల ఆధ్వర్యాన సావిత్రి బాయ్ పూలే వర్ధంతిని నిర్వహించారు. ఈ సంద్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కాకినాడ ఐడిఎ కార్యదర్శి డాక్టర్ అడ్డాల సావిత్రి బాయ్ పూలే జీవిత చరిత్రను వివరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బొండ సూర్యారావు, కాకినాడ ఐడిఎ సభ్యులు పాల్గొన్నారు. గండేపల్లి మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన సావిత్రి బాయ్ పూలే వర్ధంతి కార్యక్రమంలో ఎంపిడిఒ నాతి బుజ్జి పాల్గొన్నారు. స్త్రీల విద్యాభివృద్ధికి సావిత్రి బాయ్ పూలే చేసిన కృషిని ఆమె వివరించారు. ఈ కార్యక్రమములో పరిపాలన అధికారి కె.చంద్రరావు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సావిత్రిబాయ పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాతి బుజ్జి

బాదం క్లినికల్ ల్యాబ్‌లో నూతన సేవలు

ప్రజాశక్తి - కాకినాడ

డాక్టర్ బాదం బాలకృష్ణ క్లినికల్ ల్యాబ్‌లో ఇఎన్‌టి ఇండోస్కోపి, ఇసిజి సేవలు అందుబాటులోకి వచ్చాయి. సోమవారం ల్యాబ్‌లో నూనతంగా ఏర్పాటు చేసిన ఈ సేవలను పాస్టర్ ఎండి.రాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ వర్గాల ప్రజలకు ఎటువంటి భారం లేకుండా డాక్టర్ బాదం బాలకృష్ణ ల్యాబ్‌కు గ్రేస్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ అధినేత ముదునూరు కుమార్‌రాజు విరాళంగా వీటిని సమకూర్చినట్లు తెలిపారు బాదం ఇటువంటి సేవా కార్యక్రమాల్లో నిరంతరం నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బాదం బాలకృష్ణతో పాటు, దాత ముదునూరు కుమార్‌రాజు, జ్యోతి దంపతులు, ఆర్‌వి.రమణమూర్తి, ఎం.విశ్వేశ్వరరావు, ఎం.సుభాష్, డాక్టర్ సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

In the Court of the VIth Addl. Junior Civil Judge, Rajahmundry
O.S. 47/2024

Between:
Dadi Jaya Madhuri @ Jaya Badhuri ***...Plaintiff***
AND
B.Kanaka Ratnam and Others ***...Defendants***

D-4: Smt. Kandregula Sai, W/o. Nagendra @ Bujji, D.No. 5-204/A, Raghavendra Colony, Bommuru Village, Rajahmundry Rural.

D-9: Smt. Bheesetti Saraswathi, W/o. late Nageswara Rao, D/o. late B.Nagaraju, D.No. 5-204, Raghavendra Colony, Bommuru Village, Rajahmundry Rural.

D-10: Smt. Koyilada Saroja, W/o. K.Ramu, D/o. B.Nagaraju, D.No. 5-204, Raghavendra Colony, Bommuru Village, Rajahmundry Rural.

పై నెంబరులో మీకు నోటీసు నిమిత్తం **ది. 26-3-2025 సం॥** తేదీకి శ్రీ కోర్టు వారు ఆర్డరు వేసియున్నారు. కావున మీరు ఆ వాయిదా రోజు **ఉదయం గం॥ 10.30 ని॥లకు** పై కోర్టులో స్వయంగా గాని, వకీలు ద్వారా గాని హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకోవలెను. లేనియెడల మీ పరోక్షమందు తీర్మానించబడును.

రాజమండ్రి 10-3-25 — **సిహెచ్.వి.ప్రసాద్** వాది తరపు అడ్వకేటు

మహారాజశ్రీ 5వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టు, రాజమహేంద్రవరం
M.V.O.P. No. 315/2022

Between:
Peyyala Suseela and Others ***...Petitioners***
AND
J.Srinivasu and Others ***...Respondents***

R-2: P.Sudhakar, S/o. Satyanarayana, Hindu, aged 50 years, R/o. D.No. 1-46-61, T.B.Road, Annajipeta, Tuni, E.G.District, Owner of the vehicle bearing No: AP 01 V 0549 ***...2nd Respondent***

పై నెంబరు పిటిషన్‌లో 2వ రెస్పాండెంటు అయిన మీకు కోర్టు ద్వారా ఎన్నిసార్లు సమన్లు/ నోటీసులు పంపినా మీరు వాటిని తీసుకోకుండా ఉద్దేశ్యపూర్వకంగా త్రిప్పి వేయుచున్నారు. కావున **ది. 25-3-2025 సం॥రం తేదీ ఉదయం 10.30 ని॥లకు** మీరు స్వయంగా గాని, లేదా ప్లీడరు ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరు అయ్యి సదరు పై పిటిషన్‌లో మీ ఆక్షేపణలను తెలుపుకొనవలెను. లేనియెడల సదరు పిటిషన్‌ను మీకు పరోక్షముగా శ్రీ కోర్టు వారు తీర్మానించెదరు.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

రాజమండ్రి 02-3-2025 — **డి.పల్లవి** అడ్వకేట్స్, రాజమండ్రి

మహారాజశ్రీ కొవ్వూరు ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
E.P. 30/2019, O.S. 258/2014

Between:
మహమ్మద్ జకీరా బేగం ***...DHr***
AND

1) మహమ్మద్ హాస్నా భాను, W/o. మహబూబ్ పాషా, ముస్లిం, స్త్రీ, వయస్సు 63 సం॥లు, పెద్ద మసీదు వద్ద, వీరమ్మ చెరువు గట్టు, భీమవరం, BVRM JCJC.

2) మహమ్మద్ బషీరా భాను, D/o. మహబూబ్ పాషా, ముస్లిం, స్త్రీ, వయస్సు 30 సం॥లు, డో.నెం. 5-10-5/1, పెద్ద మసీదు వద్ద, వీరమ్మ చెరువు గట్టు, భీమవరం, BVRM JCJC.

3) మహమ్మద్ హాజరా భాను, D/o. మహబూబ్ పాషా, ముస్లిం, స్త్రీ, వయస్సు 27 సం॥లు, డో.నెం. 5-10-5/1, పెద్ద మసీదు వద్ద, వీరమ్మ చెరువు గట్టు, భీమవరం, BVRM JCJC.

యీ నెంబరు డిక్రీ బాకీ వసూలు గాను JDrs తాలూకు దిగువ షెడ్యూలు దాఖలా స్థిరాస్తిని **ది. 21-3-2025వ తేదీన ఉదయం 10.30 ని॥ల** లగాయితు శ్రీ కోర్టు వారి ఎదుట వేలం జరుగును. కావలసినవారు వేలంలో పాల్గొనవచ్చును.

<u>షెడ్యూలు</u>

పశ్చిమగోదావరి జిల్లా, కొవ్వూరు సబు రిజిష్ట్రీ, కొవ్వూరు మండలం, కొవ్వూరు మున్సిపల్ ఏరియా ఆర్.ఎస్. నెం. 576/1, పూరా చ॥ 396 గజములలో తూర్పు వైపు చ॥ 198 చ॥ స్థలము సమీప డోరు నెంబరు 15-9-69 నకు హద్దులు.

తూర్పు: దుద్దుపూడి నాగేశ్వరరావు స్థలం. **దక్షిణం:** 30 అ॥ వెడల్పు రోడ్డు. **పడమర:** వలగల వెంకటరెడ్డి కోర్టు ద్వారా కొన్న 198 చ॥ ఖాళీ స్థలం. **ఉత్తరం:** దుద్దుపూడి వెంకటకృష్ణ లేఅవుట్‌లోని ప్లాట్ నెం. 1 మరియు ప్లాట్ నెం. 10.

యీ హద్దుల మధ్య చ॥ 198 గజములు స్థలము యీజిమెంటరీ హక్కులతో సహా.

అమీనా విలువ: రూ. 8,50,000/-
DHr విలువ : రూ. 8,50,000/-
JDrs విలువ: ఏమియున్ను యిచ్చియుండలేదు.

డి.రవిశంకర్
DHr తరపు న్యాయవాది
కొవ్వూరు

కొవ్వూరు 28-2-2025 — సెల్: 9848305552